# ప్రేమ నవ్వింది

రచన :
... “జాస్మిన్” ...

★

నా వయసప్పుడు యెంతయితేనేం?

ఆడదాని లోతుపాతులు తెలియని వయసులో నేనామెని ప్రేమించేను. వికసిస్తూన్న భావాల్తో ప్రపంచాన్నంతా ఓ కొత్తకంటిలో వింతగా చూస్తూ పగటికలలు కంటూ కాలం గడిపే వయసు నాది. ఆ వయసులో నేనా అమ్మాయిని పుస్తకాల్లో రాసినట్టుగా అమిత గాఢంగా, జీవితంకన్న హెచ్చుగా, ఆమే నా సర్వస్వం అనుకొని ప్రేమించేను.

అప్పటి కా అమ్మాయికి ఎన్నేళ్ళో?

ఎన్నేళ్ళయితేనేం? ఆమె సౌందర్యానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులో అయినా సరే ఆమె సౌందర్యం అలాగే ఉంటుంది. ఆ అందం నేనింకెక్కడా చూడలేదు. అంత అందంగా ఉండే పిల్లని వర్ణించడమే కష్టం. ఆమె కనిపించినప్పుడు తొలకరి మెరపు మెరసినట్టుండేది. కళ్ళు మిరుమిట్లు గొల్పేది. తెల్లటి చిన్న పలువరస కనిపించేలా ఎర్రటి పెదవుల్తో ఆమె నవ్వినప్పుడు, వివిధ వర్ణాల్తో వికసించిన పూలతోటలో ఉన్నట్టుండేది నాకు. నావైపు అమాయకంగా చూసే ఆమె నేత్రాలు, అగాధంగా, విశాలంగా, వినీలాకాశాన్ని ప్రతిబింబింపజేసే తటాకాల్లాగ ఉండేవి. అప్పుడే ఉబుకుతున్న ఆమె రొమ్ములు నామనసులో ఊహల్ని కూడా ఉబికింపజేసేవి. ఆమెని చూసినప్పుడల్లా ఆమె చెదిరిన ఉంగరాల జుత్తులాగే నామనసు కూడా చెదిరేది; కలతచెందేది.

ఆమెని మొదటిసారి ఎప్పుడు చూసేనో నాకు బొత్తిగా జ్ఞాపకంలేదు. నా జీవితారంభంనుంచీ ఆమెతో సంబంధం కలిగినట్లే అనిపించేది నాకు. నాచిన్నతనంలోనే అనాథుడిమీద దయదలచి మంగమ్మ తండ్రి నన్ను తన ఇంటికి తీసుకువచ్చాట్ట.

అప్పటినుంచీ వాళ్ళింట్లోనే ఉన్నాను నేను. సహృదయుడైన ఆమె తండ్రి చనిపోయేవరకూ అక్కడే ఉన్నాను.

ఆమె తండ్రి హఠాత్తుగా చనిపోయేడు. అతని చావులో నన్ను నడిసముద్రంలో ముంచేసేడు. నా చదువూ పూర్తికాలేదప్పటికి. ఇంకా ఇంటర్మీడియేట్‌లో ఉన్నాను.

అతను చనిపోయిననాటిరాత్రి భయంతో విచారంతో ఏడుస్తూ కూర్చున్నాను. అతని భార్య కనకమ్మగారు ఎక్కడో గదిలో కూర్చొని ఏడుస్తున్న ఏడుపు నా భయాన్నీ విచారాన్నీ హెచ్చుచేసింది. అంతకు ముందెప్పుడూ కనపడని చుట్టాలెవరోవచ్చి ఇల్లంతా చక్కపెడుతున్నారు. ఇల్లంతా చీకటి. హరికేన్ లాంతర్లు వస్తున్నాయి పోతున్నాయి. ఏడుపుమధ్య అప్పుడప్పుడు నిశ్శబ్దం అతి నిశ్శబ్దం. నిశ్శబ్దంగా, చీకటిగా, దుఃఖంతో నిండిన గృహం భయంకరంగా ఉన్నాదానాడు.

వచ్చినవాళ్ళంతా ఎగాదిగాచూసి అప్పుడే అడిగేరు.

“ఎవరీ అబ్బాయి?”

“జవాబు చెప్పే దెవడు?”

“ఎవరీ అబ్బాయి?”

నంగిరిగా, మాటలు నముల్తూ, కళ్ళల్లో నీరాపుకుంటూ, తుడుచుకుంటూ నేనే చెప్పేవాణ్ణి.

“ఓహో”

“ఓహో”లో ఎంత నిస్సారం ఇమిడిఉంది? ఇమిడిఉన్నాదన్న ఆలోచనతో నాకు ఇంకా భయంవేసి, ఇంకా ఏడుపొచ్చింది.

దిగుల్తో గదిలో కూర్చున్నాను. ఇంట్లో ఏడుపులు, గదిలో చీకటి. నాగుండెల్లో బరువు. నాకళ్ళల్లో నీళ్ళు.

అప్పుడే మెల్లగా చీకట్లో తడుముకుంటూ వచ్చింది మంగమ్మ. అతి మెల్లగా “దయాకరం” అని పిల్చింది. నాకు వెంటనే మాట రాలేదు.

“దయాకరం”

ఆ మెత్తటి పిలుపు విని నావళ్ళు పులకరించింది. ఈ ఎడారివంటి ప్రపంచంలో నాకింకా కావలసిన వాళ్ళున్నారనే ఆశ కలిగింపజేసింది. వేసవికాలంలో చల్లటిగాలి తగిలినట్టనిపించింది.

ఆమె చేతులు పట్టుకుని దగ్గరకి లాక్కున్నాను. లాక్కోగానే వెక్కి వెక్కి ఏడుపు మొదలెట్టింది మంగమ్మ.

నాతో మరోప్రాణి దుఃఖిస్తూండడంచేత కాబోలు నాకు దుఃఖోపశమనం అయింది.

ఆ చీకట్లో నావళ్ళో కూర్చుని నాభుజం మీద తల ఆన్చుకుని గుండెలు పగిలేట్టు ఏడ్చింది మంగమ్మ.

నాకేం చెయ్యడానికీ తోచలేదు. ఏమనడానికీ తోచలేదు. “నేనుండగా నీకేం భయం లేదు ఊరుకో ఏడవకు” అని చెప్పగలిగేను, ఆమె వీపు నిమురుతూ.

మంగమ్మ నాకన్న రెండు మూడు సంవత్సరాలే చిన్న. అప్పటికప్పుడే వళ్ళంతా నిండుకుంది. కాని ఇంకా పరికిణీ, జుబ్బామాత్రం వేసుకొనేది. ఆవేళ ఏదో మెత్తటి పట్టు జుబ్బా వేసుకుంది. దానికింద ఆమె వీపు వెచ్చగా నాచేతికి తగుల్తూంది. ఆమె మెత్తటి హస్తాలు నా మెడచుట్టూ లతల్లాగ పెనవేసుకున్నాయి. ఆ సమయంలో నన్నూ, నా పరిస్థితుల్నీ, ఆదినం మృత్యువు కాహుతయిన వ్యక్తినీ, అందువల్ల నన్నంతవరకూ ముంచేసిన దుఃఖాన్నీ సర్వం మర్చిపోయి ఆమెని నా గుండెలకి అదుముకున్నాను. నేను ప్రేమించిన కన్యని అంతకుముందెప్పుడూ నాకంతదగ్గరగా తీసుకోలేదు. ఆమె కూడా రక్షణకోసమో అన్నట్టు నాకు ఇంకా దగ్గరకొచ్చి నన్ను తన గుండెల కదుముకుంది. ఆ మొదటి అనుభవములో నావళ్ళు మత్తెక్కింది. రేగినజుత్తు నా కళ్ళల్లోపడుతూ ఆమెని తప్ప వేరేమీ కానరాకుండా చేసింది. వదిలేస్తే పారిపోతానేమో అన్నట్టు ఆమెచేతులు నాచుట్టూ పెనవేసుకుపోయేయి. ఆమె మెత్తటి రొమ్ములు నా గుండెల్తో కలసిపోతున్నట్టనిపించింది. ఆ

వెచ్చదనం తగలగానే ఆమె వీపు నిమురు నా కుడిచెయ్యి వణికింది. భయపడుతూ ఆమె బుగ్గల్ని పెదవుల్తో తాకగానే కన్నీరు నా పెదవులకి అంటుకుంది.

వెంటనే నిజస్థితి, జరిగిన సంగతులూ జ్ఞప్తికివచ్చి నన్నారాటపెట్టేయి. మంగమ్మ స్థితి చూసి జాలివేసింది. నాస్థితిచూసుకొని బాధ కలిగింది.

"దయాకరం నన్నొదిలెయ్యకు, నీకు పుణ్యం ఉంటుంది నన్నొదిలెయ్యకు" అని వాపోయింది మంగమ్మ, ఆమెని నావళ్లోంచి కదులుద్దామనుకుంటే.

ఆరాత్రి అలాగే నా కౌగిట్లో నిద్రపోయింది మంగమ్మ. నాకెప్పుడు నిద్రపట్టిందో జ్ఞాపకంలేదు.

అదే ఆఖరిరోజు నేనక్కడ ఉండడం. తెల్లవారుఝామున తెలివొచ్చేసరికి మంగమ్మ నావళ్లో ఇంకా పడుక్కునేఉంది. ఎర్రటి పెదవులమీద ముద్దుపెట్టుకుని లేపేను. గాభరాలో లేచి అంతా జ్ఞాపకం తెచ్చుకుని నా భుజాలుపట్టుకుని అన్నాది మంగమ్మ.

"దయాకరం నన్ను విడిచేసి ఎక్కడికీ ఎప్పుడూ వెళ్లకు"

"వెళ్ళను. నిన్నువిడిచి ఎక్కడికీ వెళ్లలేను. ఆ జన్మాంతం నిన్నే నా మనసులో ధ్యానంచేస్తాను. నీ దగ్గరే ఉంటాను"

"నిజంగా" అంటూ తన లేతపెదవుల్తో నా బుగ్గ తాకింది మంగమ్మ.

అదే ఆఖరిరోజు నేను మంగమ్మని చూడ్డం.

ఆవేళే నన్ను ఆ ఇంట్లోంచి పంపించేసేరు. వెళ్లమని చెప్పిన వారెవరో నాకు గుర్తులేదు. వెళిపోమని మాత్రం అంతా అన్నారు. కనకమ్మగారు నాకెక్కడా కానరాలేదు. మంగమ్మని నాకంటికి కనపడనివ్వలేదు.

ఆవేళే మరోచోటికిపోయేను. మంగమ్మా వాళ్ళూ అవూరే విడిచిపోయేరు.

తరువాత కొన్నాళ్ళ కెవరో చెప్పేరు మంగమ్మకి పెళ్ళయిందని. ఆసంగతి వినగానే నా కనేక భావాలు కలిగేయి. అవన్నీ ఇప్పుడు విప్పిచెప్పలేను. కాని అప్పుడే అనుకున్నాను, ఈ జీవితంలో పెళ్ళిచేసుకోకూడదని. నాదేవతైన మంగమ్మ ఆక్రమించవలసిన స్థానాన్ని ఇంకెవ్వరూ వచ్చి అపవిత్రం చేయకూడదని తీర్మానించుకున్నాను. నా పవిత్ర ప్రేమని ఇంకెవ్వరికీ అర్పించకూడదనుకున్నాను.

ఇలా అనుకున్న ఆర్నెల్లకెవరో మాటలో మాటొచ్చి అన్నారు.

"అన్నట్టు నువ్వీ సంగతి విన్నావురా?"

"ఏ సంగతి?"

"మంగమ్మ ఎవడితోనోలేచిపోయిందిట"

"పాపపుమాటలాడకు. ఆపిల్లకి పెళ్ళయి కాపురంచేస్తూవుంటే"

"అవున్నా మొగుడితో కాపరంచేసేది. ప్రస్తుతం చెయ్యడంలేదు"

"అబద్ధం"

"ఊరంతా చెప్పుకుంటూఉంటే. పాపం నిక్షేపంలాంటి మొగుణ్ణొదిలేసి ఎవడో వెధవతో లేచిపోయిందిట. నిజమో కాదో ఎవరైనా అడుగు"

నాకు మొహం తిరిగింది.

నేనో కాంతని ప్రేమించేను. ఆమె నా సర్వస్వం. ఆమె నా దేవత. ఆమె నిష్కల్మష హృదయురాలు నాఉద్దేశంలో. ఆమె మనసు నవనీతం లాంటిది నా దృష్టికి. ఆమె పూజ్యురాలు నాభావంలో. ఆమె పవిత్రురాలు నా అభిప్రాయంలో.

అటువంటి మంగమ్మ ఇలా ప్రవర్తించడమా? అసంభవం!

"మొగుడు నానా బాధలూ పెట్టేడేమో" అన్నాను.

"అబ్బే చాలామంచివాట్ట"

"అవతలవాణ్ణెవణ్ణో ప్రేమించిందేమో"

"ప్రేమేమిటి నీమొహం. వా డెవడో వయసుమళ్ళిన వెధవ. అయితే బాగా డబ్బున్నాడిట. ఈమంగమ్మ మొగుడికి జీతపురాళ్ళు తప్ప వేరే కానీ లేదు. అందుచేత ఈ కొమ్మ విడిచిపెట్టి ఆ కొమ్మ పట్టుకుంది."

నా ముఖం ఇంకా తిరిగింది.

పరాయివాడితో పారిపోయింది!

ఎందుకని?

ప్రేమచేతనా? మోహంచేతనా? కామప్రేరేపణచేతనా? ఎందుకూ కాదు. డబ్బుకోసం. డబ్బుకోసం తనని నమ్మిన భర్తని ఎంతద్రోహంచేసింది! అతని జీవితం ఎంత భగ్నం చేసింది!

నేను ప్రేమించిన దేవత ధనాన్ని దేవతగా భావించింది. ఒక పేదబొమ్మచుట్టూ నేను రత్నహర్మ్యం కట్టేను. ప్రేమతోనిండిన నా కళ్ళకి మన్ను బంగారంలా కనపడింది.

మోకాళ్ళ మీద తలపెట్టుకుక్కూర్చుని, నాప్రేమ, నాస్వప్నాలు, నా ఆశలు, నా బ్రహ్మచర్య దీక్షావ్రతం వీటన్నింటిగురించి ఆలోచిస్తూవుంటే ఎవరో నవ్వినట్టనిపించింది. ఉలిక్కిపడి చూసేను.

ఎదురుగా నిల్చొని కిలకిల నవ్వుతున్నాది "ప్రేమమూర్తి" నన్ను చూసి నవ్వుతూ అన్నాది.

"అమాయకుడా, నేను చూపెట్టేదంతా నిజమే ననుకుని మోసపోయేవు. అందుచేత ఇప్పుడు బాధపడుతున్నావు. ఇప్పటికైనా తెలుసుకో. నేనే నిజం. నేను చూపించేదంతా అబద్ధం. నేను చూపెట్టేది ఒకప్పుడు నిజమవొచ్చు. కాని సాధారణంగా అబద్ధమే అవుతుంది. నేనుండే తావులన్నీ పవిత్రమైనవని భావించకు. అపవిత్రమైన, అసహ్యమైన స్థలాల్లో కూడా నేను మెసుల్తాను. అయితే నేనుండే ప్రదేశమంతా స్వర్గంలా కనిపిస్తుంది నిజంగా నరకమే అయినప్పటికీ. అలాగని నిన్ను మోసపుచ్చుదామనే దురుద్దేశంతో నీకు సుఖస్వప్నాలు కల్గించను. నావెంట అవి కూడా వస్తూంటాయి. వద్దంటే మానవు. మోసపోకుండా ఉండాలంటే నీ జాగ్రత్త మీద నువ్వుండాలి" అని చెప్పి "ప్రేమమూర్తి" మాయమయింది.

మనం ప్రేమించే వస్తువు పవిత్రమైనా అవొచ్చనీ, అపవిత్రమైనా అవొచ్చనీ, మనం ప్రేమించినంతమాత్రాన దాన్లో లేని గుణాలు దానికి కలగవనీ అప్పుడు తెలుసుకున్నాను.